


నారాయణఖేడ్‌లో ఎడ్లబండి మీద ఎమ్మెల్యే

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



సంగారెడ్డి 5 మెదక్

జిల్లాల వార్తలు

శుక్రవారం 19 జూలై 2024

ఆనందమానందమాయే..

రైతు రుణమాఫీ సంబురాలు

అన్నదాతలతో మాట్లాడిన సీఎం

మంత్రి దామోదర్ చొరవతోనేనని కితాబు

పలుచోట్ల రేవంత్ చిత్రపటానికి క్షీరాభిషేకం



మెదక్‌లో పటాకులు కాలుస్తున్న కాంగ్రెస్ శ్రేణులు, రైతులు

ఉమ్మడి జిల్లాలో రుణమాఫీ కార్యక్రమం పండుగలా సాగింది. రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తామని ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలో భాగంగా గురువారం రూ. లక్ష లోపు రుణాలున్న రైతు ఖాతాల్లో రుణమాఫీ నిధులు జమయ్యాయి. ఈ సందర్భంగా సంగారెడ్డి జిల్లా జోగిపేట మండలం డాకూరు గ్రామంలోని రైతు వేదికపై ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి దామోదర్ రాజనర్సింహ, కలెక్టర్ వల్లూరి క్రాంతి పాల్గొనగా, ఉమ్మడి జిల్లా వ్యాప్తం ఇద్దరు రైతులతో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. తాము ఆగస్టు నుంచి రుణమాఫీ చేయాలని భావించగా, మంత్రి దామోదర రాజనర్సింహా పట్టుపట్టి ఈ నెల నుంచే అమలు చేయించారని రేవంత్ అన్నారు. ఇక పలుచోట్ల సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి రైతులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు క్షీరాభిషేకం చేశారు.



కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు మొక్కను అందజేస్తున్న మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

కలెక్టర్‌ను కలిసిన ఎస్పీ

మెదక్ అర్బన్, జూలై 18: మెదక్ ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన ఉదయక్‌కుమార్‌రెడ్డి గురువారం కలెక్టర్ రాహుల్‌రాజ్‌ను కలిశారు. జిల్లాలో శాంతి భద్రతలు, పోలీసు శాఖ, పరిపాలక అధికార యంత్రాంగం మధ్య సమన్వయం, జిల్లాకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు.

రైతు రుణమాఫీ పేరిట లింకులు వస్తే ఓపెన్ చెయొద్దు

రైతు రుణమాఫీ అంటూ మొబైల్ ఫోన్‌కు లింకులు వస్తే ఓపెన్ చెయొద్దని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో సూచించారు. ప్రభుత్వం ఏదైనా కార్యక్రమం ప్రారంభించగానే సైబర్ నేరగాళ్లు అదే పేరిట ఆన్‌లైన్ మోసాలు చేస్తున్నారని పేర్కొన్నారు. దీనిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ఎవరైనా సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 నంబర్‌కు ఫోన్ చేయడం, దగ్గర్లోని పోలీస్‌స్టేషన్‌లో రిపోర్టు చేయడం ద్వారా డబ్బును రికవరీ చేసే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

రుణమాఫీ చరిత్రాత్మకం



సీఎం రేవంత్‌తో మాట్లాడుతున్న రైతు శివయ్య, పక్కనే మహిళా రైతు లక్ష్మమ్మ

- మాట నిలబెట్టుకునే సత్తా కాంగ్రెస్‌కే ఉంది
- 'అందోలు'లోనే అత్యధిక లబ్ధిదారులు
- ఒక్క నియోజకవర్గంలోనే రూ. 107 కోట్లు మాఫీ
- రైతు భద్రత, ప్రజా సంక్షేమం, అభివృద్ధికి మా ప్రభుత్వ ధ్యేయం
- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ

జోగిపేట, జూలై 18: రైతులకు ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీ చేసి చూపించామని, ఈ రోజు చరిత్రలో నిలిచిపోతుందని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా అందోల్ మండలం డాకూరు గ్రామంలోని రైతువేదికలో ఏర్పాటు చేసిన రుణమాఫీ సమావేశం, ముఖ్యమంత్రితో వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరంగల్ ఎన్నికల సభలో చేసిన వ్యవసాయ డిక్లరేషన్‌లో రూ. 2 లక్షల వరకు రైతుల రుణాలను మాఫీ చేస్తామని రాహుల్‌గాంధీ ప్రకటించారని, ఆయన మాట మేరకు గురువారం నుంచి అమలు చేస్తున్నామని చెప్పారు. హామీలను అమలుచేసే సత్తా, చిత్తశుద్ధి కాంగ్రెస్ పార్టీకే ఉందని పేర్కొన్నారు.

మూడుసార్లు రుణమాఫీ చేశాం

రాష్ట్రంలో 13 సంవత్సరాల్లో మూడుసార్లు రైతుల రుణాలను మాఫీ చేసిన ఘనత కాంగ్రెస్‌కే దక్కుతుందని మంత్రి పేర్కొన్నారు. తొలివిడతలో రూ. లక్ష వరకు రుణాల మాఫీ కోసం నిధులు విడుదల చేశామని తెలిపారు. ఒక్కరోజే రాష్ట్రవ్యాప్తంగా 11.42 లక్షల మంది రైతులకు రూ. 7 వేల కోట్ల రుణమాఫీ జరిగిందని చెప్పారు. నెలాఖరు వరకు రూ. 1.5 లక్షల రుణాలు, ఆగస్టు 15 నాటికి రూ. 2 లక్షల లోపు రుణాలన్నింటినీ మాఫీ చేస్తామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అందోలు నియోజకవర్గంలోనే రుణమాఫీ లబ్ధిదారులు ఎక్కువగా ఉన్నారని పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా 48 వేల మంది లబ్ధిదారులుండగా.. అందోలు నియోజకవర్గంలోనే 20 వేల మంది ఉన్నారని తెలిపారు. తమ ప్రభుత్వం ప్రజా సంక్షేమం, రైతు భద్రత, అభివృద్ధికి ప్రాధాన్యమిస్తున్నదని చెప్పారు. ఈమేరకు ప్రకటించిన పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తామని చెప్పారు. సమావేశంలో కలెక్టర్ క్రాంతి వల్లూరి, అదనపు కలెక్టర్ మనోజ్, జిల్లా వ్యవసాయాధికారి అంబికా సోని, ఆర్డీవో పాండు, ఏడీఏ అరుణగౌడ్, ఏఈవో విజయరత్న, ప్రాథమిక సహకార సంఘం చైర్మన్ జీఆర్ నరేందర్‌రెడ్డి, జోగిపేట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పద్మనాభరెడ్డి, ఆత్మ మాజీ చైర్మన్ జోగిరెడ్డి, జోగిపేట మున్సిపల్ చైర్మన్ జి.మల్లయ్య, వైస్ చైర్మన్ డేవిడ్, కౌన్సిలర్లు సురేందర్‌గౌడ్, రాజు, రంగ సురేశ్, సీనియర్ నాయకులు ఎం.జగన్మోహన్‌రెడ్డి, జీఆర్ మధుసూన్‌రెడ్డి, నాయకులు డీజీ వెంకటేశం, తాటికొండ శ్రీధర్, మాజీ సర్పంచ్ పూజా రమేశ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బృహత్తరమైన కార్యక్రమం : ఎంపీ

జహీరాబాద్ : రైతు రుణమాఫీ బృహత్తరమైన కార్యక్రమని జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ షెట్కార్ పేర్కొన్నారు. జహీరాబాద్ మండలం హుగ్గెల్లి రైతువేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రుణమాఫీ సమావేశం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, మాజీ మంత్రి చంద్రశేఖర్ తదితరులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు, సామాన్యుల కష్టాలు తెలిసిన పార్టీ కాంగ్రెస్ అని పేర్కొన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం సాగుతున్నదని అన్నారు. రుణమాఫీ లాంటి కార్యక్రమాలను చేపట్టడం కాంగ్రెస్‌కే సాధ్యమవుతుందని తెలిపారు. జహీరాబాద్ నియోజకవర్గంలో ఒకేరోజు రూ.56 కోట్ల రుణాలు మాఫీ అయ్యాయని చెప్పారు. 9,400 మంది రైతులకు ప్రయోజనం చేకూరనుందన్నారు. అనంతరం మాజీ మంత్రి చంద్రశేఖర్ మాట్లాడుతూ గతంలో రాజశేఖరరెడ్డి హయాంలో ఏకకాలంలో రుణమాఫీ జరిగిందని, ప్రస్తుతం రేవంత్‌రెడ్డి హయాంలో మరోసారి జరుగుతున్నదని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు రాములు, కండెం నర్సింహులు, నర్సింహారెడ్డి, ఖాజామియా, కిషన్, ఏడీఏ భిక్షపతి, ఏవో ప్రవీణ, ఏఈవోలు ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



కౌడిపల్లిలో సీఎం వీడియోకాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ జిల్లాలో సంబరాలు

పటాకులు కాల్చి, స్వీట్లు పంచిన కాంగ్రెస్ నాయకులు

మెదక్ కల్చరల్, జూలై 18: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం రైతు రుణమాఫీ చేయడంతో మెదక్ జిల్లా కేంద్రంలో సంబరాలు జరుపుకున్నారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి ర్యాలీగా తరలివచ్చిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మెదక్‌లోని రైతువేదికలో సీఎం రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్‌ను వీక్షించారు. అనంతరం రైతులకు స్వీట్లు తినిపించారు. అక్కడి నుంచి పట్టణంలో ర్యాలీ నిర్వహించి బస్‌డిపో ఎదుట పటాకులు కాల్చారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హఫీజ్ మొల్సాబ్, సీనియర్ నాయకుడు శ్రీనివాస్‌చౌదరి, సొసైటీ చైర్మన్ హనుమంతరావు, మాజీ మున్సిపల్ చైర్మన్ సురేందర్‌గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శంకర్, బొజ్జ పవన్, మున్నా, అమెర్, సిద్దిరామాగౌడ్, కమ్మరి మురళి తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతీ ఒక్కరికి రుణమాఫీ : కలెక్టర్

కౌడిపల్లి: అర్హులైన ప్రతీ ఒక్కరికి రుణమాఫీ వర్తిస్తుందని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. మెదక్ జిల్లా కౌడిపల్లిలోని రైతువేదికలో గురువారం రుణమాఫీ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. సీఎం వీడియోకాన్ఫరెన్స్‌ను తిలకించారు. అనంతరం మాట్లడుతూ జిల్లాలో 45వేల కుటుంబాలకు రూ.241 కోట్ల రుణాలు మాఫీ అయ్యాయని తెలిపారు. రుణమాఫీపై ఎలాంటి అనుమానాలున్నా వ్యవసాయాధికారులను సంప్రదించాలని సూచించారు. కార్యమ్రంలో జిల్లా వ్యవసాయ అధికారి గోవిందు, డీఎల్‌డీఎం నర్సింహమూర్తి, కౌడిపల్లి ఏడీఏ పుణ్యవతి, డీసీసీబీ మేనేజర్ ప్రద్యుమ్నారెడ్డి, మహ్మద్‌నగర్ సొసైటీ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, తహసీల్దార్ ఆంజనేయులు రైతులు పాల్గొన్నారు.

బ్యాంక్ మేనేజర్లు సమన్వయంతో వ్యవహరించాలి

మెదక్/మెదక్ అర్బన్, జూలై 18: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాకత్మకంగా చేపట్టిన రుణమాఫీ పథకం జిల్లాలోని అర్హులైన ప్రతీ రైతుకు వర్తించేలా పకడ్బందీ చర్యలు తీసుకోవాలనిజిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులకు సూచించారు. గురువారం కలెక్టరేట్ నుంచి బ్యాంకు మేనేజర్లతో గూగుల్ మీట్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొదటి విడత కింద మెదక్ జిల్లాలో రూ.లక్షలోపు రుణం తీసుకున్న 45,882 మంది రైతులకు రూ.241.82 కోట్ల సొమ్మును వారి వారి ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసిందన్నారు. 12 డిసెంబర్ 2018 నుంచి 1 డిసెంబర్ 2023 మధ్యలో తీసుకున్న పంట రుణాలకు ఈ పథకం వర్తిస్తుందని తెలిపారు. రుణమాఫీని సమీక్షించడానికి ప్రతీ మండల కేంద్రంలో బ్యాంకర్లు, వ్యవసాయ అధికారులతో గ్రీవెన్స్‌సెల్ ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఇందుకోసం వ్యవసాయశాఖ తరఫున సీనియర్ అధికారిని కేటాయిస్తామని చెప్పారు. గ్రీవెన్స్‌సెల్‌కు వచ్చే ఫిర్యాదులను 30 రోజుల్లో పరిష్కరించాలని నిర్దేశించారు. రుణమాఫీ వివరాలను ప్రతీరోజు తనకు నివేదించాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్, ఎల్‌డీఎం నరసింహమూర్తి, బ్యాంకు కంట్రోలర్స్, మేనేజర్లు, కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

గృహజ్యోతి కోసం పడిగాపులు

ఎన్నిసార్లు ధ్రువపత్రాలు ఇచ్చిన రాని జీరో బిల్లు

ప్రజాపాలన దరఖాస్తులకు ఎడిట్ ఆప్షన్ లేక నిరాశ



కోహీర్‌లో ప్రజాపాలన దరఖాస్తుల కౌంటర్ వద్ద లబ్ధిదారులు

కోహీర్, జూలై 18 : అన్ని అర్హతలు ఉన్నా.. ఎన్నిసార్లు ధ్రువపత్రాలు ఇచ్చినా.. 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగిస్తున్నా తమకు గృహజ్యోతి పథకం వర్తించడం లేదని లబ్ధిదారులు వాపోతున్నారు. ప్రభుత్వం ప్రజాపాలన దరఖాస్తులకు ఎడిట్ ఆప్షన్ ఇస్తున్నట్టు ప్రకటించడంతో కోహీర్ మండల పరిషత్ కార్యాలయంలోని ప్రజాపాలన కౌంటర్‌లో ధ్రువపత్రాలు అందజేసేందుకు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివస్తున్నారు. గత సంవత్సరం డిసెంబరులో ప్రభుత్వం ఆరు గ్యారెంటీల అమలు కోసం ప్రజాపాలన దరఖాస్తులు తీసుకున్నది. అప్పట్లో పలువురు దరఖాస్తు ఫారాలు పూరించడంలో అవగాహన లేక గృహజ్యోతి పథకం కావాలని టిక్ చేయలేదు. దీంతో అన్ని అర్హతలు ఉన్నా పలువురు లబ్ధిదారులకు గృహజ్యోతి పథకం అమలు కాలేదు. ఈ విషయంపై ప్రజల నుంచి డిమాండ్లు వెల్లువెత్తడంతో ప్రభుత్వం ప్రజాపాలన దరఖాస్తులకు ఎడిట్ ఆప్షన్ ఇస్తున్నట్టు ప్రకటించినా.. ఇంకా అమలుకావడం లేదు. దీంతో గురువారం పెద్దసంఖ్యలో దరఖాస్తుదారులు గతంలో నింపిన దరఖాస్తులను సరిచేసుకునేందుకు ధ్రువపత్రాలతో తరలివచ్చారు. వీరిలో కొందరు ఇప్పటికే ధ్రువపత్రాలు ఇచ్చినా, లబ్ధిదారుల జాబితాలలో తమ పేరు వచ్చినా జీరో బిల్లులు రావడంలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే పలుమార్లు ధ్రువపత్రాలు ఇచ్చామని, జీరో బిల్ కోసం ఇచ్చిన దరఖాస్తు ధ్రువీకరించినట్టు సెల్‌ఫోన్‌కు మెసేజ్ వచ్చినా.. కరెంటు నగదు బిల్లు వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో, అన్ని అర్హతలు ఉన్నా బిల్లు కట్టాల్సి వస్తున్నదని వాపోతున్నారు.

పొరుగు జిల్లాల్లో పరీక్షా కేంద్రాలు

- జిల్లాలో 310 ఖాళీలు.. డీఎస్సీ రాస్తున్న 15 వేల మంది
- వసతులు లేక ఇబ్బందులు

మెదక్, జూలై 18: రాష్ట్రంలో ఉపాధ్యాయ నియామక పరీక్షలు (డీఎస్సీ) ప్రారంభమయ్యాయి. ఆగస్టు 5 వతేదీ వరకూ ఈ పరీక్షలు జరగనున్నాయి. మెదక్ జిల్లా వ్యాప్తంగా 310 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం డీఎస్సీ నిర్వహిస్తున్నారు. సర్కారు బడుల్లో టీచర్ల పోస్టుల ఖాళీలను భర్తీ చేయడానికి మెగా డీఎస్సీని ప్రకటించడంతో 15వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. ఏళ్ల తరబడిగా ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయకపోవడంతో ఆయా సబ్జెక్టు ఉపాధ్యాయులు లేక విద్యలో వెనుకబడుతున్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించి జిల్లాలో 566 ఎస్‌జీటీలను స్కూల్ అసిస్టెంట్లుగా నియామకాలు చేపట్టగా, 499 మంది ఉపాధ్యాయులు చేరారు. ఒక్కో ఉపాధ్యాయుడికి రెండేసి సబ్జెక్టుల్లో పదోన్నతి రావడంతో కొన్ని ఖాళీలు మిగిలిపోయాయి. మొత్తం స్కూల్ అసిస్టెంట్ ఖాళీల్లో 70 శాతం ప్రమోషన్ల ద్వారా, 30 శాతం డీఎస్సీ ద్వారా భర్తీ చేస్తున్నారు. ప్రస్తుత డీఎస్సీలో 310 పోస్టులను భర్తీ చేయనున్నారు. ఇందులో 178 సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయ ఖాళీలు, 101 స్కూల్ అసిస్టెంట్ల ఖాళీలు, 30 భాషా పండితుల పోస్టుల ఖాళీలు, 1 వ్యాయామ ఉపాధ్యాయ ఖాళీని భర్తీ చేసేందుకు డీఎస్సీని నిర్వహిస్తున్నారు.

పక్క జిల్లాలకు వెళ్లాల్సిందే..

డీఎస్సీ తొలిసారి ఆన్‌లైన్‌లో జరుగుతున్న నేపథ్యంలో పరీక్షల నిర్వహణకు సిద్దిపేట, హైదరాబాద్, వరంగల్ జిల్లాల్లో కేంద్రాలను ఏర్పాటు చేశారు. మెదక్ జిల్లాలో కళాశాలలో అత్యాధునిక సాంకేతిక సదుపాయాలు కొరవడడంతో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయడం సాధ్యం కాలేదని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. మెదక్ జిల్లా కేంద్రంలో ఒక్క ఇంజనీరింగ్ కళాశాల కూడా లేకపోవడం గమనార్హం. గతంలో నెలకొల్పిన రెండు ఇంజనీరింగ్ కళాశాలలు కూడా మూతపడ్డాయి.

మరోసారి ట్రిపుల్‌ఆర్ సర్వేను అడ్డుకున్న రైతులు

- రెండు గంటలు నచ్చజెప్పినా వినని రైతులు
- సర్వే చేయకుండానే వెనుదిరిగిన అధికారులు

నర్సాపూర్, జూలై 18: ట్రిపుల్‌ఆర్ ఆర్ రోడ్డు కోసం తమ భూములు ఇవ్వాలంటే మార్కెట్ ధర చెల్లించాలని, లేదా భూమికి బదులు మరోచోట భూమి ఇవ్వాలని, తక్కువ భూమి పోయేలా అలైన్‌మెంట్ మార్చాలని నర్సాపూర్ మండలం రెడ్డిపల్లి గ్రామ రైతులు సర్వేకు వచ్చిన అధికారులను అడ్డుకున్నారు. దీంతో మరోసారి అధికారులు సర్వే చేయకుండానే వెనుదిరిగారు. ట్రిపుల్‌ఆర్ సర్వే కోసం ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి, జాతీయ రహదారుల అథారిటీ అధికారులు, సర్వే అధికారులు, సీఐ జాన్‌రెడ్డి, ఎస్‌ఐ పుష్పరాజ్ రెడ్డిపల్లి గ్రామానికి వెళ్లారు. పోలీసు బలగాలతో వచ్చినా రైతులు అధికారులను అడ్డుకున్నారు. ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి రైతులను నచ్చజెప్పే ప్రయత్నం చేసినా శాంతించలేదు. దీంతో, సర్వే చేయకుండానే వెనుదిరిగారు. ఈ సందర్భంగా ఆర్డీవో విలేకరులతో మాట్లాడుతూ రైతులకు మెరుగైన పరిహారం వచ్చేందుకు కలెక్టర్ రాహుల్ రాజ్ కృషి చేస్తున్నారని తెలిపారు. అలైన్‌మెంట్ మార్చడానికి అవకాశముండదని, రైతులు గుర్తించి సర్వేకు సహకరించాలని కోరారు. డివిజన్ పరిధిలో 17 గ్రామాల్లో సర్వే చేయాల్సి ఉండగా ఇప్పటికే 13 గ్రామాల్లో పూర్తయిందని తెలిపారు. నర్సాపూర్ మండలం రెడ్డిపల్లి, శివ్వంపేట మండలంలో రత్నాపూర్, కొత్తపేట, కొంతాన్‌పల్లిలో మాత్రమే సర్వేను రైతులు అడ్డుకుంటున్నారని చెప్పారు. రైతులకు నచ్చజెప్పి సర్వే పూర్తి చేస్తామని పేర్కొన్నారు.



అధికారులను చుట్టుముట్టి సర్వే చేయకుండా అడ్డుకుంటున్న రైతులు



సర్వేకు సహకరించాలని రైతులకు నచ్చజెపుతున్న ఆర్డీవో, అధికారులు

హైస్కూళ్లలో ప్రహరీ క్లబ్‌లు

- డ్రగ్స్ నివారణకు సర్కారు చర్యలు
- ఉత్తర్వులు జారీ చేసిన విద్యాశాఖ

సంగారెడ్డి అర్బన్, జూలై 18 : మత్తు పదార్థాల అలవాటు నేటి యువత, ముఖ్యంగా విద్యార్థుల జీవితాన్ని చిత్తు చేస్తున్నది. ఇది మానసిక శారీరక అనారోగ్యాలకు కుంగుబాటుకు గురిచేస్తున్నది. గంజాయి మహమ్మారి ఇప్పుడు గ్రామీణ ప్రాంతాలకూ పాకింది. ఈ నేపథ్యంలో పిల్లలు మాదకద్రవ్యాల బారినపడకుండా వాటిని అరికట్టేందుకు సర్కారు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో ప్రహరీ క్లబ్‌ల ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. విద్యార్థులు మత్తు పదార్థాలను వినియోగించకుండా, వాటిని పాఠశాల చుట్టుపక్కల ఎవరూ విక్రయించకుండా ఈ క్లబ్‌లు పటిష్ట చర్యలు తీసుకుంటాయి. డ్రగ్స్‌పై విద్యార్థుల్లో అవగాహన పెంచడంతో పాటు నిరంతరం నిఘా వేసి ఉంచుతాయని విద్యాశాఖ జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 400 ప్రభుత్వ, ప్రైవేటు ఉన్నత పాఠశాలల్లో ప్రహరీ క్లబ్‌ల ఏర్పాటుకు జిల్లా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

కమిటీ ఇలా..

ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేయనున్న ప్రహరీ క్లబ్ అధ్యక్షుడిగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు/ప్రిన్సిపాల్, ఉపాధ్యక్షుడిగా సీనియర్ ఉపాధ్యాయుడు/చైల్డ్ ఫ్రెండ్లీ టీచర్, సభ్యులుగా 6 నుంచి పదో తరగతుల వరకు ఒక్కో తరగతిలో ఇద్దరు విద్యార్థులతో పాటు తల్లిదండ్రుల నుంచి ఒకరు, స్థానిక పోలీసు స్టేషన్ నుంచి ఒకరు ఉంటారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లనూ వినియోగించుకోనున్నారు. సుమారు 14 మందితో కమిటీ ఏర్పాటు కానుంది.

కమిటీలు ఏం చేస్తాయంటే...

మాదకద్రవ్యాలకు సరఫరా, అలవాటుపడిన విద్యార్థులుంటే గుర్తించి, వారిని అప్రమత్తం చేసి, వాటి దుష్ప్రభావాలను వివరించి మాన్పిస్తారు. డ్రగ్స్ అక్రమ రవాణాకు పిల్లల్ని ఉపయోగిస్తున్నట్లయితే తగిన జాగత్తలు తీసుకొని కట్టడి చేస్తారు. పాఠశాల ఆవరణలో చుట్టుపక్కల ఏదైనా కార్యకలాపాలు, మాదకద్రవ్యాలు, పదార్థాల వినియోగం, అమ్మకం, అనుమానిత కార్యకలాపాలపై అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకుంటారు. మాదకద్రవ్యాల నిర్మూలనకు సహకరించాలంటూ కోరనున్నారు.



సంగారెడ్డి జిల్లాలో ఐదుగురు డిప్యూటీ సివిల్ సర్జన్లకు స్థాన చలనం

- ముగ్గురు డిప్యూటీ డీఎంహెచ్‌వోలు హైదరాబాద్‌కు బదిలీ
- ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డా.గాయత్రీదేవీకి కోహీర్ పోస్టింగ్

సంగారెడ్డి అర్బన్, జూలై 18 : సాధారణ బదిలీల ప్రక్రియలో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో పలువురు వైద్యాధికారులకు స్థానచలనం కలిగింది. ఇందుకోసం హైదరాబాద్‌లో గురువారం కౌన్సెలింగ్ నిర్వహించగా ఐదుగురు డిప్యూటీ సివిల్ సర్జన్లు బదిలీ అయ్యారు. ఇద్దరికి జిల్లాలోనే పోస్టింగ్ దక్కగా, మరో ముగ్గురు హైదరాబాద్‌లోని వివిధ ఆస్పత్రులకు బదిలీ అయ్యారు. డిప్యూటీ సివిల్ సర్జన్ హోదాలో కొంతకాలంగా జిల్లా ఇన్‌చార్జి డీఎంహెచ్‌వోగా కొనసాగుతున్న డా.గాయత్రీదేవి బదిలీల్లో కోహీర్(జహీరాబాద్) క్లస్టర్‌కు డిప్యూటీ డీఎంహెచ్‌వోగా నియమితులయ్యారు. సదాశివపేట డిప్యూటీ డీఎంహెచ్‌వోగా పనిచేస్తున్న డా.నాగనిర్మలకు ఎంసీహెచ్ అండ్ సీహెచ్‌ఐ ప్రోగ్రాం ఆఫీసర్‌గా జిల్లాలోనే పోస్టింగ్ దక్కింది. కోహీర్ డిప్యూటీ డీఎంహెచ్‌వో డా.శంకర్ హైదరాబాద్‌లోని నీలోఫర్ ఆస్పత్రికి, నారాయణఖేడ్ డిప్యూటీ డీఎంహెచ్‌వో డా.సంతోష్ ఉస్మానియా జనరల్ ఆస్పత్రికి, పీవోడీటీ డా.మహ్మద్ ఇబ్రహీమ్ సరోజినీ నాయుడు ఆస్పత్రికి బదిలీ అయ్యారు. కాగా, నేడు సివిల్ సర్జన్ల బదిలీ కౌన్సెలింగ్ జరగనున్న నేపథ్యంలో సంగారెడ్డి జిల్లాకు రెగ్యులర్ డీఎంహెచ్‌వో వచ్చే అవకాశం ఉన్నట్టు వైద్య ఆరోగ్యశాఖ వర్గాలు తెలిపాయి.

ఐటీఐలో ప్రవేశాలకు వెబ్ ఆప్షన్లు

సంగారెడ్డి అర్బన్, జూలై 18 : ఐటీఐలో ప్రవేశాలకు ఈ నెల 21వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో వెబ్‌ఆప్షన్లు నమోదు చేసుకోవాలని కన్వీనర్ రాజేశ్వర్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఐటీఐలో అడ్మిషన్ పొందవచ్చని, 1.8.2024 నాటికి 14 సంవత్సరాలు నిండిన విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

రికార్డులన్నీ సరిగ్గా నిర్వహించాలి

● అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

కంది, జూలై 18 : రికార్డులన్నీ సరిగ్గా మెయింటెన్ చేయాలని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ అన్నారు. గురువారం ఆయన మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలోని అన్ని విభాగాలతో పాటు అక్కడి రికార్డులను పరిశీలిచారు. రికార్డులు సక్రమంగా ఉంటేనే పనులు ముందుకు సాగుతాయని పేర్కొన్నారు. త్వరలో ప్రారంభించనున్న వనమహోత్సవానికి నర్సరీల్లో మొక్కలు సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో శ్రీనివాస్, సూపరింటెండెంట్ వేణుగోపాల్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ మోసాలకు రైతులే గుణపాఠం చెప్తారు

● సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



సంగారెడ్డి రూరల్, జూలై 18 : రైతు రుణమాఫీతో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మరోమారు మోసగిస్తోందని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ గురువారం ఓ ప్రకటనలో విమర్శించారు. రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేస్తామని రాహుల్ గాంధీ, రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చి, తెల్లరేషన్ కార్డు ప్రామాణికంగా ప్రకటించడంపై రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. ఎన్నికల సమయంలో ఎలాంటి షరతులు లేకుండా రైతు రుణమాఫీ చేస్తామని ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు షరతులు ఎందుకు పెట్టిందని ఆయన ప్రశ్నించారు. రైతుల పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని చింతా ప్రభాకర్ డిమాండ్ చేశారు. రైతు రుణమాఫీపై ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాలు అభ్యంతరకరంగా ఉన్నాయన్నారు.

ఘనపూర్ రెండు టీఎంసీలు.. హల్దీ వాగుకు ఒక టీఎంసీ నీరు

ఎమ్మెల్యే వినతితో విడుదల చేయాలని నీటి పారుదల శాఖ అధికారులను ఆదేశించిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

నర్సాపూర్, జూలై 18: మెదక్ జిల్లాలోని హల్దీవాగు, ఘనపూర్ ఆనకట్టకు నీరు విడుదల చేయాలని కోరగా నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పందించి అధికారులకు ఆదేశాలు జారీ చేశారని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి పేర్కొన్నారు. గురువారం 'ఆంధ్రజ్యోతి'తో ఎమ్మెల్యే సునీతారెడ్డి ఫోన్‌లో మాట్లాడుతూ వివరాలను తెలిపారు. నర్సాపూర్ నియోజకవర్గంలోని హల్దీవాగులో ప్రస్తుతం నీరు లేకపోవడంతో రైతులు పంటలకు నీరందించే అవకాశం లేకుండా ఇబ్బంది పడుతున్నారని, ఒక టీఎంసీ నీటిని హల్దీవాగుకు కొండపోచమ్మ నుంచి విడుదల చేయాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కోరినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా మెదక్ సమీపంలోని ఘనపూర్ ఆనకట్టకు కూడా రెండు టీఎంసీలు విడుదల చేయాలని కోరగా మంత్రి సానుకూలంగా స్పందించి వెంటనే నీటి విడుదలకు సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారన్నారు. జిల్లా ప్రజల తరఫున మంత్రికి ఎమ్మెల్యే సునీతారెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

సింగూరు నీటిని విడుదల చేయండి

● సీఎంకు లేఖ రాసిన మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్‌రెడ్డి

మెదక్ మున్సిపాలిటీ, జూలై 18 : మెదక్ జిల్లాలో వర్షాభావం అనుకూలంగా లేకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారని, సింగూరు నుంచి ఘనపురం ఆయకట్టుకు 2 టీఎంసీల నీటిని విడుదల చేయాలని మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు గురువారం ఆయన సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. ఆదేవిధంగా కొండపోచమ్మసాగర్ నుంచి హల్దీవాగుకు మరో రెండు టీఎంసీల నీటిని విడుదల చేయాలని విజ్ఞప్తి చేస్తూ లేఖను సీఎం కార్యాలయంలో అందజేసినట్లు తెలిపారు.

అందరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

● సంగారెడ్డి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రమేశ్



మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రమేశ్

సంగారెడ్డి అర్బన్, జూలై 18 : చట్టాలపై అందరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రమేశ్ సూచించారు. సంగారెడ్డిలోని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ లా కళాశాలో గురువారం న్యాయ అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని, న్యాయ వ్యవస్థలో ఎలా ఉండాలో వివరించారు. గృహ హింస, బాల్య వివాహ నిషేధ చట్టం, పోస్కో, వరకట్న నిషేధ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యార్థులకు న్యాపపరమైన అంశాలపై సహాయం కోసం న్యాయసేవాధికార సంస్థను సంప్రదించవచ్చని ఆయన సూచించారు. అంతుకుముందు కళాశాలను తనిఖీ చేసిన ఆయన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ గీతాదేవి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

చెట్టుకు ఉరేసుకుని వీఆర్ఏ ఆత్మహత్య


నీరుడి సాయిలు

కల్హేర్, జూలై 18 : విధి నిర్వహణలో ఎదురవుతున్న ఇబ్బందులతో పాటు తరచూ కడుపునొప్పి బాధ ఎక్కువకావడంతో వీఆర్ఏ ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం మండల పరిధిలోని మహాదేవ్‌పల్లి గ్రామ శివారులో చోటుచేసుకున్నది. హెడ్‌కానిస్టేబుల్ గంగాధర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని మార్డి గ్రామానికి చెందిన నీరుడి సాయిలు(32) వీఆర్ఏగా పనిచేస్తున్నాడు. గత ప్రభుత్వ హయాంలో వీఆర్ఏలను ఇతర శాఖల్లో విలీనం చేయగా సాయిలును జహీరాబాద్ మున్సిపల్ కార్యాలయానికి కేటాయించారు. విధి నిర్వహణ కోసం రోజూ దూరం వెళ్లి రావడం, ఆర్థికంగానూ ఇబ్బందులు పడుతున్నాడు. తన సోదరుడైన నీరుడి రమేష్ మహాదేవ్‌పల్లి గ్రామానికి ఇల్లరికం అల్లుడిగా వెళ్లగా బుధవారం సోదరుడిని కలిసేందుకు మహాదేవ్‌పల్లికి వెళ్లాడు. సోదరుని అత్తగారి ఇంట్లో నుంచి అర్ధరాత్రి వెళ్లి గ్రామ శివారులోని చింతచెట్టుకు ఉరి వేసుకున్నాడు. సోదరుడు రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఆయన తెలిపారు.

యాసిడ్ తాగి మరొకరు..


రాయరపు నర్సింహాచారి మృతదేహం

తూప్రాన్, జూలై 18 : ఇంటి కొనుగోలుకు చేసిన అప్పు తీర్చలేక యాసిడ్ సేవించాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ సంఘటన తూప్రాన్ పట్టణంలో బుధవారం రాత్రి చోటు చేసుకున్నది. తూప్రాన్ ఎస్ఐ శివానందం కథనం ప్రకారం.. తూప్రాన్ పట్టణానికి చెందిన రాయరపు నర్సింహాచారి(40) బంగారు నగలు తయారీ వృత్తిలో కొనసాగుతూ జీవిస్తున్నాడు. నాలుగేళ్ల క్రితం ఇంటిని కొనుగోలు చేయగా, బ్యాంకు నుంచి రూ.17 లక్షలు అప్పు చేశాడు. ఆ డబ్బు సరిపోకపోవడంతో తెలిసిన వ్యక్తుల వద్ద మరో రూ.6 లక్షలు అప్పు చేశాడు. బంగారు నగల తయారీ ఆదాయం మినహా ఇతర ఆదాయం లేకపోవడంతో వడ్డీ పెరిగిపోయింది. డబ్బు చెల్లింపులు చేసే పరిస్థితి లేక బుధవారం సాయంత్రం తన దుకాణంలో బంగారం కరిగించేందుకు ఉపయోగించే యాసిడ్‌ను సేవించాడు. పక్కనే ఉన్న దుకాణ దారుడు గుర్తించడంతో ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ నర్సింహాచారి బుధవారం రాత్రి మృతిచెందాడు. మృతుడి భార్య కవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివానందం వివరించారు.

అన్నదమ్ముల మధ్య గొడవతో...


వేముల శ్రీనివాస్(ఫైల్)

రాయపోల్, జూలై 18 : అన్నదమ్ములతో గొడవతో విరక్తిచెంది ఓ రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన రాయపోల్ మండలం వీరారెడ్డిపల్లి గ్రామంలో చోటుచేసుకున్నది. రాయపోల్ ఎస్‌హెచ్‌వో కృష్ణం రాజు కథనం ప్రకారం.. వీరారెడ్డిపల్లి గ్రామానికి చెందిన వేముల శ్రీనివాస్, మల్లయ్య, కిష్టయ్య, యాదయ్య అన్నదమ్ములు. పొలం వద్ద, ఇంటి వద్ద ఉన్న భూముల విషయంలో శ్రీనివాస్‌తో మరికొందరు సోదరులకు తరచూ గొడవలు జరుగుచున్నాయి. దీంతో విరక్తి చెందిన శ్రీనివాస్ బుధవారం రాత్రి ఇంటి సమీపంలో నిర్మాణంలో ఉన్న ఓ పిల్లర్‌కు ఉరేసుకొని మృతి చెందాడు. గురువారం ఉదయం కుటుంబసభ్యులు గమనించారు. ఈ మేరకు మృతుని కొడుకు అశోక్ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతి

కొల్చారం, జూలై 18 : ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన కొల్చారం పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం వెలుగులోకి వచ్చింది. మండల పరిధిలోని పైతర గ్రామానికి చెందిన తాటి మల్లేశం(54) బుధవారం రాత్రి పీర్ల పండుగ ముగించుకుని కాళ్లు, చేతులు కడుక్కుందామని పైతరలోని పటేల్‌చెరువు దగ్గరికి వెళ్లాడు. ప్రమాదవశాత్తు కాలు జారి చెరువులో పడిపోయాడు. అతని భార్య నర్సమ్మ తన భర్త తిరిగి ఇంటికి రాకపోయేసరికి గురువారం ఉదయం వెతుకుతుండగా, చెరువుగట్టు వద్ద మల్లేశం ధోవతి కనిపించగా, చెరువులో గాలించగా శవం బయటపడింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేస్తున్నారు.

రూ.17.03 లక్షల విలువైన గుట్కా పట్టివేత


జహీరాబాద్‌లో పట్టుకున్న గుట్కా వాహనంతో పోలీసులు

జహీరాబాద్/నారాయణఖేడ్ జూలై 18 : జహీరాబాద్, నారాయణఖేడ్ పరిధిలో గురువారం రూ.17.03 లక్షల విలువైన గుట్కాను గురువారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే.. జహీరాబాద్ పట్టణంలోని చిన్ని సత్యనారాయణ తన కిరాణా దుకాణంలో గుట్కా విక్రయిస్తున్నాడనే సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేయగా రూ.లక్ష విలువ చేసే నిషేధిత గుట్కా, పాన్‌మసాల లభ్యమైంది. వాటిని స్వాధీనం చేసుకుని పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అలాగే ఖమ్మం జిల్లాకు చెందిన మహ్మద్ అఫ్సర్ అక్రమంగా గుట్కాలను తీసుకువెళ్తున్నట్లు నమ్మదగ్గ సమాచారం మేరకు అతడి టాటా ఏస్ వాహనాన్ని జహీరాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పట్టుకున్నారు. వాహనంలో రూ.11.50 లక్షల విలువైన నిషేధిత గుట్కా ప్యాకెట్లను పట్టుకుని జహీరాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నారాయణఖేడ్ పట్టణంలో నిషేధిత గుట్కా పాకెట్ల గోదాంపై సీసీఎస్ పోలీసులు దాడులు చేసి పట్టుకున్నారు. ఎస్ఐ విద్యాచరణ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని వెంకటేశ్వర సినిమా థియేటర్ పక్కన పాత ఇంట్లో గుట్కా ప్యాకెట్లు ఉన్నట్లు వచ్చిన సమాచారం మేరకు సంగారెడ్డి సీసీఎస్ పోలీసులు దాడులు చేశారని తెలిపారు. ఆ ఇంట్లో నిలువ చేసిన రూ.4,53,748 విలువైన గుట్కా పాకెట్లు లభించినట్లు తెలిపారు. నిందితుడు పట్టణానికి చెందిన వెంకటేశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విద్యాచరణ్ వివరించారు.


ఖేడ్‌లో పట్టుబడిన గుట్కా పాకెట్లు

చికిత్స పొందుతూ బాలుడి మృతి

మునిపల్లి, జూలై 18 : ఆటో బోల్తా పడి ఆరేళ్ల బాలుడికి తీవ్ర గాయాలు కాగా, చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన గురువారం పొల్కంపల్లి గ్రామ శివారులో జరిగింది. ఇందుకు సంబంధించి మునిపల్లి ఏఎస్ఐ ఏసయ్య తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్ బేగంపేటకు చెందిన మహ్మద్ అక్బర్ మొహర్రం పండుగ సందర్భంగా తన ఆటోలో న్యాల్‌కల్ మండలం శనగపల్లి గ్రామానికి బుధవారం కుటుంబసభ్యులతో కలిసి బంధువుల వద్దకు వెళ్తున్నాడు. అయితే, మునిపల్లి మండలం కంకోల్ వైపునకు వెళ్లాల్సి ఉండగా దారి తప్పి బుదేరా చౌరస్తా మీదుగా పొల్కంపల్లి వైపు వెళ్తున్న క్రమంలో అదుపు తప్పి ఆటో బోల్తా కొట్టింది. దీంతో అందులో ప్రయాణిస్తున్న అక్బర్‌తోపాటు భార్య హస్మా బేగం, బంధువులకు స్వల్ప గాయాలయ్యాయి. కొడుకు బేగ్ పరహాన్(6)కు బలమైన గాయాలయ్యాయి. దీంతో బాలుడిని సంగారెడ్డి ప్రభుత్వాసుపత్రికి తరలించి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో గురువారం మృతిచెందినట్లు ఏఎస్ఐ ఏసయ్య తెలిపారు. తల్లి హస్మాబేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

హడలెత్తిస్తున్నాయ్!


చిన్నకోడూరులోని ఓ వీధిలో గుంపుగా తిరుగుతున్న కుక్కలు

వీధుల్లో గుంపులు గుంపులుగా కుక్కల సంచారం
బయటకు వెళ్లాలంటే జంకుతున్న ప్రజలు

చిన్నకోడూరు, జూలై 18 : జిల్లాలో వీధి కుక్కలు హడలెత్తిస్తున్నాయి. గుంపులు గుంపులుగా సంచరిస్తూ స్వైర విహారం చేస్తున్నాయి. రాత్రివేళల్లో వాహనాలపై వెళ్తుంటే వెంటపడి పరుగులు తీస్తున్నాయి. దీంతో రోడ్లపైకి వెళ్లాలంటేనే మహిళలు, చిన్నారులు జంకుతున్నారు. శునకాలు రాత్రి వేళల్లో వీధుల్లో సంచరిస్తూ అరుస్తుండడంతో నిద్ర పట్టడడం లేదని పలు గ్రామాల ప్రజలు వాపోతున్నారు. శునకాల దాడిలో పలువురు గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందిన సంఘటనలు వెలుగుచూస్తున్నా, వీధి శునకాల సమస్య పరిష్కారానికి అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారులు స్పందించి వీధి శునకాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఆదేవిధంగా పశువులు, జీవాల (గొర్రెలు, మేకలు)పై శునకాలు దాడిచేసి హతమార్చిన సంఘటనలూ ఉన్నాయి. చిన్నకోడూరు మండలంలోని గోనెపల్లి గ్రామంలో ఇటీవల శునకాల దాడిలో 14 జీవాలు మృతిచెందాయి.

జనవరి నుంచి కుక్క కాట్లు

మండలంలోని చిన్నకోడూరు, ఇబ్రహీంనగర్ గ్రామాల్లో రెండు పీహెచ్‌సీలు ఉండగా ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు చిన్నకోడూరు పీహెచ్‌సీ పరిధిలో కుక్కకాటుతో 124 మంది, ఇబ్రహీంనగర్ పీహెచ్‌సీ పరిధిలో కుక్కకాటుతో 126 మంది బాధితులు టీకా కోసం ఆస్పత్రులకు వచ్చినట్లు పీహెచ్‌సీల వైద్యులు తెలిపారు. కాగా రెండు పీహెచ్‌సీలలో ఆంటీ రాబీస్ వ్యాక్సిన్ (ఏఆర్‌వీ) అందుబాటులో ఉందని ఆయా పీహెచ్‌సీల వైద్యాధికారులు చెప్పారు.

బయటకు వెళ్లాలంటే భయంగా ఉంది

వీధుల్లో కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతున్నాయి. పిల్లలు పాఠశాలలకు వెళ్లేటప్పుడు, బయట ఆడుకునేటప్పుడు కుక్కలు ఎక్కడ దాడి చేస్తాయోనని భయాందోళనకు గురవుతున్నాం. మేము బయటకు వెళ్లాలన్నా భయంగానే ఉంది. కుక్కల నియంత్రణకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

- లక్ష్మి, చిన్నకోడూరు

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం



గ్రామాల్లో శునకాల బెడద సమస్య గురించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. వారి ఆదేశానుసారం శునకాల నియంత్రణకు చర్యలు తీసుకుంటాం.

- సోమిరెడ్డి, ఎంపీవో, చిన్నకోడూరు


చిన్నకోడూరు మండలం గోనెపల్లిలో కుక్కల దాడిలో మృతి చెందిన జీవాలు (ఫైల్)

రుణమాఫీ సంబరాల్లో గ్రూప్ వార్

ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డితో కాటా గ్రూపు వాగ్వాదం

జిన్నారం, జూలై 18 : మండలంలోని సోలక్‌పల్లి రైతువేదికలో నిర్వహించిన రైతు రుణమాఫీ కార్యక్రమంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి సహా నాయకులు నీలం మధు, గాలి అనిల్‌కుమార్, మాజీ జడ్పీటీసీ ప్రభాకర్ కూర్చోగా మాజీ ఎంపీపీ రవీందర్‌గౌడ్‌కు సీటు లేకపోవటంతో వాగ్వాదం నెలకొన్నది. సమావేశంలో కొందరు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కాటా శ్రీనివాస్‌గౌడ్ జిందాబాద్ అంటూ నినాదాలు చేయటంతో గందరగోళం నెలకొన్నది. పార్టీ కోసం కష్టపడ్డ వారికి కాకుండా ఇటీవల పార్టీలో చేరిన వారికి సీటు ఎలా ఇస్తారని నిలదీశారు. ఈ నేపథ్యంలో కార్యక్రమాన్ని త్వరగా ముగించి నాయకులు వెళ్లిపోయారు. కాగా ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన నాయకులు ఆధిపత్య ధోరణితో వ్యవహరిస్తున్నారని కాంగ్రెస్ కార్యకర్తలు ఆరోపించారు. పోలీసులు జోక్యం చేసుకుని ఆందోళనకారులని నిలువరించారు. కాగా, అందరినీ కలుపుకుని కార్యక్రమాలు నిర్వహిస్తామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి సమావేశంలో తెలిపారు.


ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డితో వాగ్వాదానికి దిగిన కాంగ్రెస్ నేత


రైతువేదికలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీపై పక్క నియోజకవర్గ ఎమ్మెల్యే ఫొటో

వెల్దుర్తిలో కనిపించని స్థానిక ఎమ్మెల్యే ఫొటో

వెల్దుర్తి, జూలై 18 : రుణమాఫీ సంబరాలలో భాగంగా గురువారం మండల కేంద్రమైన వెల్దుర్తి రైతువేదికలో నిర్వహించిన కార్యక్రమంలో వేదికపై ఏర్పాటు చేసిన బ్యానర్‌లో స్థానిక ఎమ్మెల్యే సునీతారెడ్డి ఫొటో లేకపోవడం గమనార్హం. స్థానిక ఎమ్మెల్యే ఫొటోకు బదులుగా మెదక్ ఎమ్మెల్యే చిత్రంలో కూడిన ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. పలువురు గుర్తించి సూచించడంతో బ్యానర్‌ను అధికారులు సంబరాల మధ్యలోనే తొలగించారు. ఈ విషయమై మాజీ ఎంపీటీసీ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య వ్యవస్థలో పార్టీలకతీతకంగా ప్రజాప్రతినిధులను గౌరవించాల్సిన అధికారులు ఇలా మర్చిపోవడం సరికాదన్నారు. ఈ సంఘటన అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శమని ఆయన మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి ఝాన్సీ, సొసైటీ ఛైర్మన్ అనంతరెడ్డి, రైతులు, నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ పాలనలో రాజ్యాంగానికి ప్రమాదం

● సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి


మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి

గజ్వేల్, జూలై 18: బీజేపీ ప్రభుత్వం అధికారంలో వచ్చాక రాజ్యాంగం ప్రమాదంలో పడిందని, బీజేపీ ప్రశ్నించే గొంతులను ఇబ్బందులకు గురిచేస్తోందని సీపీఐ జాతీయ కార్యవర్గసభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. గురువారం గజ్వేల్ పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో సీపీఐ జనరల్ బాడీ సమావేశం జిల్లా కార్యదర్శి మంద పవన్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ ఈజీఎస్ బడ్జెట్‌ని పెంచి కనీసం ఉపాధి హామీ కూలీలకు ఏడు వందల రూపాయలను ఇవ్వాలని, మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన మాటకు కట్టుబడి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రైతు రుణమాఫీ చేయడం సంతోషకరమని, కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు గజ్వేల్ ప్రజల సమస్యలు తీరాయని గొప్ప మాటలు విన్నామని, తప్పితే సమస్యలు అలాగే మిగిలి ఉన్నాయని విమర్శించారు. అంతకు ముందు మున్సిపాలిటీ పరిధిలో భారీ బైక్‌ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యుడు ఎడ్ల వెంకట్‌రాంరెడ్డి, రాష్ట్ర నాయకులు ప్రకాష్‌రావు, గజ్వేల్ డివిజన్ కార్యదర్శి శివలింగు కృష్ణ, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అందె అశోక్, బెక్కంటి సంపత్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్ మాయమాటలు నమ్మొద్దు

● బీజేపీ మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్


మాట్లాడుతున్న ప్రభాకర్

మెదక్ అర్బన్, జూలై 18 : కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒక్కటేనని, ఆ రెండు పార్టీల మాయమాటలను ప్రజలు నమ్మొద్దని బీజేపీ మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ అన్నారు. గురువారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన జిల్లా విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్యకర్తల కృషితో మెదక్ ఎంపీ స్థానాన్ని గెలిచామన్నారు. అదే పట్టుదలతో రాబోయే సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లోనూ అత్యధిక స్థానాల్లో కాషాయ జెండాను ఎగరవేలయాలన్నారు. బూత్‌స్థాయి కార్యకర్తలు, అధ్యక్షులు, శక్తి కేంద్రాల ఇన్‌చార్జిలు సమన్వయంతో పనిచేస్తూ.. పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పరిణీత, మురళీయాదవ్, నియోజకర్గ ఇన్‌చార్జీ పంజా విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు లాభసాటి వ్యవసాయం వైపు దృష్టి సారించాలి

● ఆయిల్‌పామ్ సాగుతో 30 ఏళ్ల పాటు స్థిరమైన ఆదాయం

కల్హేర్, జూలై 18 : రైతులు లాభసాటి వ్యవసాయం వైపు దృష్టి సారించాలని ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ సంగారెడ్డి జిల్లా అధికారిణి మౌనికరెడ్డి అన్నారు. గురువారం కల్హేర్ మండల పరిధిలోని క్రిష్టాపూర్ గ్రామ శివారులో రైతు నర్సింహారెడ్డి క్షేత్రంలో అయిల్‌పామ్ మొక్కలను నాటారు. అనంతరం నిర్వహించిన రైతుల అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ ఒకసారి అయిల్‌పామ్ మొక్కలను నాటితే నాలుగో సంవత్సరం నుంచి 30 సంవత్సరాల వరకు రైతుకు స్థిరమైన ఆదాయం అభిస్తుందని తెలిపారు. చీడపీడల బెడద, అకాల వర్షాలు, వడగండ్లు ఎలాంటి ప్రభావం చూపవని పేర్కొన్నారు. అంతరపంటగా ఇతర పంటలు సాగు చేసుకోవచ్చునన్నారు. అయిల్‌పామ్ ఒక మొక్క ధర రూ.193 ఉంటే ప్రభుత్వం సబ్సీడిపై రూ.20లకే అందిస్తుందని అన్నారు. అలాగే, డ్రిప్ పరికలాలు కూడా అందిస్తున్నట్లు తెలిపారు. అంతేకాకుండా పంటల యాజమాన్యం కోసం రైతుల ఖాతాల్లో డబ్బు జమ చేయడం జరుగుతుందని మౌనికరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో గోద్రెజ్ ఆగ్రోటెక్ కంపెనీ డీజీఎం వేగుంట స్వీటి, కల్హేర్ మాజీ జడ్పీటీసీ నర్సింహారెడ్డి, మాజీ సర్పంచ్ కిష్టారెడ్డి, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌గౌడ్, పీఏసీఎస్ సీఈవో బ్రహ్మం, రైతులు పాల్గొన్నారు.


మొక్కను నాటుతున్న రైతు

వైకుంఠధామం.. ప్రారంభానికి సిద్ధం

● నర్సాపూర్‌లో సకల సదుపాయాలతో నిర్మాణం

నర్సాపూర్, జూలై 18 : కనీసం నీళ్ల సదుపాయం కూడా లేకుండా ఉన్న నర్సాపూర్ శ్మశానవాటిక నిర్మాణం ఎట్టకేలకు పూర్తయింది. నర్సాపూర్-హైదరాబాద్ ప్రధాన రోడ్డు మార్గంలో పట్టణ పరిధిలోని అన్ని వర్గాల వారికి విశాలమైన శ్మశానవాటిక ఉన్నది. కానీ అక్కడ అంతిమ సంస్కారాలు నిర్వహించేందుకు ఎలాంటి సదుపాయాలు లేవు. కనీసం అంత్యక్రియలు పూర్తయిన తర్వాత స్నానాలు చేయడానికి కూడా సౌకర్యం లేకపోవడంతో సమీపంలోని చెరువు వద్దకు వెళ్లి స్నానాలు చేసేవారు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు అందులో పడి మృత్యువాత పడిన ఘటనలూ ఉన్నాయి. వీటన్నింటిని గుర్తించిన మున్సిపల్.. ఈ శ్మశానవాటికను అధునాతన పద్ధతిలో తీర్చిదిద్దాలనే ఆలోచనతతో ప్రభుత్వం నుంచి వచ్చిన రాష్ట్ర ఫైనాన్స్ నిధులు రూ.కోటి కేటాయించింది.


పురుషులు, మహిళలకు ప్రత్యేకంగా స్నానాల గదులు

అన్ని సౌకర్యాలతో..

కోటి రూపాయల నిధులతో చేపట్టిన పనుల్లో ప్రత్యేకంగా పురుషులు, మహిళలకు స్నానాల గదులు ఏర్పాటు చేశారు. అదేవిధంగా రెండు దహన సంస్కారాల ప్లాట్‌ఫామ్‌లు, అంత్యక్రియలు పూర్తయ్యే వరకు సంబంధీకులు వేచి ఉండే గది, దింపుడు కల్లం, పూజలు నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాటు చేశారు. వీటితోపాటు నీటి వసతి, ప్రహరీ నిర్మాణం చేపట్టి వైకుంఠధామాన్ని ప్రత్యేకంగా తీర్చిదిద్ది ప్రారంభానికి సిద్ధంగా ఉంచారు.

వైకుంఠధామాన్ని త్వరలో ప్రారంభిస్తాం

నర్సాపూర్‌లో అన్ని హంగులతో నిర్మించిన వైకుంఠధామాన్ని త్వరలోనే ప్రారంభిస్తాం. అంత్యక్రియలకు వచ్చేవారికి ఇబ్బంది రాకుండా అన్ని ఏర్పాట్లు చేయడంతో పాటు పచ్చదనంపై ప్రత్యేక శ్రద్ధ చూపించాం. గార్డెన్‌ను తలపించేలా మొక్కలు పెంచుతున్నాం.

- అశోక్‌గౌడ్, మున్సిపల్ చైర్మన్


దహన సంస్కారాలు చేసేందుకు ప్రత్యేక నిర్మాణం

రహదారులు అధ్వానం


గంతలమయంగా మారిన రాళ్లకత్వ-కంజర్ల దారి

జిన్నారం, జూలై 18 : మండలంలోని పలు ప్రధాన రహదారులు పూర్తి గుంతలమయం అవడంతో ప్రయాణికులకు ఇబ్బందికరంగా మారాయి. కాజీపల్లి, మల్లంపేటల మధ్య ఔటర్ రింగ్‌రోడ్డు బ్రిడ్జి కింద నీరు నిలిచి రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. రెండేళ్లుగా ఇక్కడ వర్షపు నీరు వెళ్లే దారి లేక భారీగా నీరు చేరి ప్రయాణాలు చేయటం సాహసంగా మారింది. బ్రిడ్జికి ఇరువైపులా ప్రయాణాలు చేయకుండా బారీకేడ్లు అడ్డుగా పెట్టారు. ఇక బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని ప్రధాన రహదారి గత నాలుగేళ్లుగా మట్టి రోడ్డుగానే ఉన్నది. బొల్లారం కాజీపల్లి మధ్య గతంలో బీటి రోడ్డు వేయగా కోర్టు కేసు కారణంగా పనులు జరుగలేదు. ఆ కేసు పరిష్కారమై రెండేళ్ల గడిచినా పనులు చేపట్టడం లేదు. సోలక్‌పల్లి, కంజర్ల రోడ్డు పనులు అసంపూర్తిగా నిలిచిపోవటంతో గుంతలమయంగా మారింది. ముఖ్యంగా రాళ్లకత్వ నుంచి కంజర్ల వరకు బీటి వేయాల్సి ఉండగా పనులు నిలిచిపోవటంతో భారీ గుంతలు ఏర్పడి నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. అసంపూర్తి రోడ్డును వెంటనే పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.



కాజీపల్లి సమీపంలో ఔటర్ రింగ్ రోడ్డు బ్రిడ్జి కింద వారం రోజులుగా నిలిచిన నీరు, బీటీకి నోచుకోని బొల్లారం-కాజీపల్లి ప్రధాన దారి


జహీరాబాద్: హుగ్గెల్లి రైతువేదికలో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడుతున్న ఎంపీ సురేష్‌కుమార్ షెట్కార్


పెద్దశంకరంపేట: శివాయిపల్లిలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి


జిన్నారం: సోలక్‌పల్లి రైతువేదికలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి


నర్సాపూర్‌లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు, కార్యకర్తలు

రూ.2 లక్షల రుణమాఫీ ఘనత ప్రభుత్వానిదే

- నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి
- పలు మండలాల్లో రుణమాఫీ సంబరాలు
- సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకాలు

పెద్దశంకరంపేట, జూలై 18: రైతులకు ఇచ్చిన హామీమేరకు రుణమాఫీ చేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికి, కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని నారాయణఖేడ్ ఎమ్మెల్యే పి.సంజీవరెడ్డి అన్నారు. గురువారం పెద్దశంకరం పేట మండలం శివాయిపల్లి గ్రామ శివారులోని రైతువేదికలో నిర్వహించిన రైతు రుణమాఫీ సంబురాల్లో పాల్గొన్నారు.

●**అల్లాదుర్గం:** అల్లాదుర్గం మండలం చేవళ్ల గ్రామంలోని రైతువేది కలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మండల ప్రత్యే కాధికారి కరుణ, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కొప్పుల శేషారెడ్డి పాల్గొన్నారు.

●**నర్సాపూర్:** నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి క్యాంపు కార్యాలయం నుంచి మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, రాష్ట్ర నాయకులు సుహాసినిరెడ్డి, శేషసాయిరెడ్డి, రవీం దర్‌రెడ్డి నుంచి తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు, రైతులతో కలిసి ప్రధాన చౌరస్తా వరకు ర్యాలీగా వచ్చారు.

●**కొల్చారం:** కొల్చారం మండలంలోని బస్టాండ్ వద్ద కాంగ్రెస్ మండ లాధ్యక్షుడు మల్లేశంగౌడ్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరా భిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు రవీందర్‌రెడ్డి, గౌడ సంఘం మండలాధ్యక్షుడు వెంకట్‌గౌడ్, శేఖర్, గోవర్ధన్ పాల్గొన్నారు. కొల్చారంలోని రైతువేదికలో వీడియో కాన్ఫరెన్స్‌ను మండల ప్రత్యేకాధి కారి, డీఈవో రాధాక్రిష్ణ, తహసీల్దార్ మహ్మద్ గఫార్‌మియా తిలకించారు.

●**రామాయంపేట:** రామాయంపేటలో టీపీసీసీ కార్యదర్శి సుప్రభాత్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు పల్లె రామచందర్‌గౌడ్ ఆధ్వర్యంలో సంబురాలు జరుపుకున్నారు. అనంతరం రైతులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మెదక్ చౌరస్తా మీదుగా పాత హైవేపై ర్యాలీ నిర్వహించారు.

●**నిజాంపేట:** నిజాంపేట మండల వ్యాప్తంగా రుణమాఫీ సంబరాలు జరుపుకున్నారు. నస్కల్‌లోని రైతువేదికలో సీఎం ప్రసంగాన్ని వీక్షించారు.

●**పాపన్నపేట:** పాపన్నపేట మండలంలో కొత్తపల్లి సొసైటీ వద్ద చైర్మన్ రమేష్ సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనం తరం మల్లంపేట రైతువేదికలో సీఎం, మంత్రుల ప్రసంగాలు విన్నారు.

●**రేగోడు:** మండలంలోని టి లింగంపల్లి రైతువేదికలో నిర్వహించిన రుణమాఫీ సందేశాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీక్షించారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి దామోదర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు.

●**మాసాయిపేట:** మాసాయిపేట మండలంలోని రైతువేదికలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన నాయకులు, కార్యకర్తలు సంబరాలు జరుపుకు న్నారు. మండలంలోని ప్రధాన కూడలి నుంచి ర్యాలీ నిర్వహించారు.

●**వెల్దుర్తి:** మండల కేంద్రమైన వెల్దుర్తిలోని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మహేష్‌రెడ్డి ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తా వద్ద సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. వెల్దుర్తి రైతువేదికలో సంబరాలు నిర్వహించారు.

●**తూప్రాన్:** తూప్రాన్ మండలం గుండ్రెడ్డిపల్లి రైతువేదికలో రుణ మాఫీ పథకం ప్రత్యక్ష వీక్షణం చేపట్టారు. ఇందులో పార్టీ మండలాధ్య క్షుడు భాస్కర్‌రెడ్డి, రైతు నాయకులు నేత మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు. తూప్రాన్‌లో పాత హైవే రోడ్డుపై సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభి షేకం నిర్వహించారు.

●**మనోహరాబాద్:** మనోహరాబాద్ మండల కేంద్రంలోని రైతవేదిక వద్ద సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఆర్డీవో జయ చంద్రారెడ్డి హాజరయ్యారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగాన్ని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు మహిపాల్‌రెడ్డి, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, మండల వ్యవసా యాధికారి స్రవంతి వీక్షించారు.

●**హవేళిఘణపూర్:** మండల కేంద్రంలోని చౌరస్తాలో పార్టీ మండలా ధ్యక్షుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభి షేకం చేశారు. అలాగే మండల పరిధి కూచన్‌పల్లిలోని రైతువేదికలో సీఎం వీడియో కాన్ఫరెన్స్‌ను రైతులు వీక్షించారు.

●**వట్‌పల్లి:** మండల కేంద్రంలో రుణమాఫీపై రైతువేదికలో సీఎం సందేశం విన్న అనంతరం కాంగ్రెస్ నాయకులు చౌరస్తాలో బాణసంచా కాలుస్తూ మిఠాయిలు పంచుకున్నారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి దామోదర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

●**చేగుంట:** చేగుంట, నార్సింగి మండలాల్లో రైతువేదికల్లో గురువారం సీఎం రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్‌ను అధికారులు, రైతులు వీక్షించారు. అనంతరం నార్సింగిలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు.

●**శివ్వంపేట:** శివ్వంపేట రైతువేదికలో రేవంత్‌రెడ్డి కాన్ఫరెన్స్‌ను వీక్షించిన రైతులు.. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నవీన్‌కుమార్ గుప్తా ఆధ్వర్యంలో రైతువేదిక నుంచి ప్రధాన రహదారి వరకు ర్యాలీ నిర్వహించి బాణసంచా కాల్చి, సంబురాలు చేసుకున్నారు. తూప్రాన్, నర్సాపూర్ ప్రధాన రహదారిపై సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

●**చిన్నశంకరంపేట:** చిన్నశంకరంపేట మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో కాంగ్రెస్ శ్రేణులు సీఎం చిత్రపటానికి క్షీరాభిక్షేకం నిర్వ హించారు.

సంగారెడ్డి జిల్లాలో

జిన్నారం, జూలై 18: దేశ చరిత్రలో ఒకే విడతలో రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చారిత్రాత్మకమని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. గురు వారం జిన్నారం మండలం సోలక్‌పల్లి రైతువేదికలో రుణమాఫీ ప్రారంభో త్సవంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభి షేకం నిర్వహించి రైతులకు స్వీట్లు పంపిణీ చేశారు.

●**నారాయణఖేడ్:** ఒకేమారు రూ.2 లక్షల రుణమాఫీ చేయడం చారి త్రాత్మకమని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి పేర్కొ న్నారు. గురువారం ఖేడ్‌లో రుణమాఫీ సంబురాల్లో భాగంగా ఖేడ్ తహ సీల్ మైదానం నుంచి రాజీవ్ కూడలి వరకు కొబ్బరిమట్టలు, గాలి బుడ గలు, అలంకరించిన ఎడ్లబండ్ల ప్రదర్శన నిర్వహించారు. జూకల్ శివారు లోని రైతువేదికలో రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు.

●**కోహీర్:** కోహీర్ మండలంలోని 2,054 మంది లబ్ధిదారులకు రుణ మాఫీ జరగడంతో కోహీర్‌లోని రైతువేదిక వద్ద సంబరాలు జరుపుకు న్నారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

●**పటాన్‌చెరు:** ఒకేసారి రుణమాఫీ చేసి కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి చరిత్ర సృష్టించారని కాంగ్రెస్ నాయకుడు, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి కొనియాడారు. పటాన్‌చెరులో గురువారం రైతు మాఫీపై కాంగ్రెస్ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి స్వీట్లను పంపిణీ చేశారు.

●**రామచంద్రాపురం:** రామచంద్రాపురం మండల పరిధి తెల్లాపూర్ మున్సిపాలిటీలోని వెలిమెలలో గురువారం రుణమాఫీ ఉత్సవాలను పీఏసీ ఎస్ చైర్మన్ మల్లెపల్లి బుచ్చిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. అలాగే కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు సి.ప్రభాకర్‌రెడ్డి, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ పర్స శ్యాంరావు, భరత్‌కుమార్‌ఆధ్వర్యంలో తెల్లాపూర్ సర్కిల్ వద్ద సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

●**కల్హేర్:** రైతులకు లక్ష లోపు రుణమాఫీ చేయడంతో గురువారం రైతులు, కాంగ్రెస్ నాయకులు కల్హేర్, సిర్గాపూర్ మండలాల్లో సంబరాలు జరుపుకున్నారు. కల్హేర్, ఇందిరానగర్‌లో సీఎం క్షీరాభిషేకం చేశారు.

●**గుమ్మడిదల:** గుమ్మడిదల మండలం కేంద్రంలోని రైతువేదిక వద్ద ఏర్పాటుచేసిన సంబరాల వేడుకల్లో ఏవో శ్రీనివాసరావు, కాంగ్రెస్ మండ లాధ్యక్షుడు నర్సింగరావు, పీఏసీఎస్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

●**పుల్‌కల్:** పుల్కల్ మండలంలో మొదటివిడతగా 3,814 మంది రైతు లకు రూ.లక్షా రుణమాఫీ జరిగింది. ఇందులో భాగంగానే ఆయా క్లస్టర్ గ్రామాల్లోని రైతువేదికల వద్ద బాణసంచాలు కాల్చి, మిఠాయిలు పంచిపె ట్టారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి, దామోదర రాజనరసింహ చిత్రపటా లకు క్షీరాభిషేకం చేశారు. గొంగ్లూరు క్లస్టర్‌లోని రైతువేదిక వద్ద నిర్వహిం చిన వేడుకలకు మంత్రి దామోదర హాజరయ్యారు.

●**రాయికోడ్:** మండల కేంద్రమైన రాయికోడ్‌లోని రైతువేదికలో రుణ మాఫీ సంబరాలు జరుపుకుని, సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి దామోదర చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేశారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జి.అంజయ్య తాజా మాజీ జడ్పీటీసీ మల్లికార్జున్‌పాటిల్, ఉమ్మడి మెదక్ జిల్లా మాజీ డీసీఎంఎస్ చైర్మన్ సిద్దన్నపాటిల్ పాల్గొన్నారు.

●**మునిపల్లి:** మండల కేంద్రమైన మునిపల్లి రైతువేదికతోపాటు ఆయా గ్రామాల్లో గురువారం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి రైతులు, కాంగ్రెస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు.

●**కంది:** కంది మండల పరిధి చిద్రుప్ప గ్రామంలోని రైతువేదికలో వ్యవసాయ శాఖ అధికారులు గురువారం రైతు రుణమాఫీ కార్యక్రమాన్ని మీడియాకు సమాచారం ఇవ్వకుండా సాదాసీదాగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 60 మంది రైతులు హాజరుకావడం చర్చనీయాంశమైంది.

●**ఝరాసంగం:** ఝరాసంగంతోపాటు మండల పరిధిలోని కక్కర్‌వాడ, బర్దీపూర్ గ్రామాల్లో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

●**న్యాల్‌కల్:** న్యాల్‌కల్ మండలంలోని ముంగి గ్రామ రైతువేదికలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు.

రైతుల శ్రేయస్సు కోరేది కాంగ్రెస్ ప్రభుత్వమే

- కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు పులిమామిడి రాజు



సదాశివపేట, జూలై 18: గత ఎన్నికల్లో సీఎం రేవం త్‌రెడ్డి రైతులకు ఇచ్చిన హామీని నిజం చేస్తూ రూ.2 లక్షల రుణాలను మాఫీ చేయడం చారిత్రాత్మక నిర్ణయ మని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు పులిమామిడి రాజు అన్నారు. గురువారం మండలంలోని మద్దికుంట శివా రులో రాజు ఆధ్వర్యంలో రుణమాఫీ సంబరాలు నిర్వ హించారు. పులిమామిడిరాజు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతులపై ఉన్న చిత్తశుద్ధికి రుణమాఫీయే నిదర్శనమన్నారు.


పాపన్నపేట: కొత్తపల్లి సొసైటీలో రేవంత్‌రెడ్డి చిత్రపటానికి నాయకుల క్షీరాభిషేకం


వెల్దుర్తి అంబేద్కర్ చౌరస్తా వద్ద రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్ననాయకులు


తూప్రాన్: గుండ్రెడ్డిపల్లి రైతువేదికలో రుణమాఫీ వీడియో కాన్ఫరెన్స్ వీక్షిస్తున్న దృశ్యం


గుమ్మడిదల: రైతువేదికలో సీఎం వీడియో కాన్ఫరెన్స్ వీక్షిస్తున్న రైతులు, కాంగ్రెస్ నాయకులు


రాయికోడ్‌లో రేవంత్‌రెడ్డి, దామోదర్ రాజనర్సింహ చిత్రపటాలకు క్షీరాభిషేకం

సమాచారం

కాంగ్రెస్‌పై తిరుగుబాటు తప్పదు

శివ్వంపేట, జూలై 18: కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధుకు సంబంధిం చిన డబ్బులను రుణమాఫీకి మళ్లించి రైతులను మోసం చేస్తుందని శివ్వం పేట మాజీ ఎంపీపీ కల్లూరి హరికృష్ణ విమర్శించారు. గురువారం ఏర్పాటుచే సిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా సాయిరాం

నారాయణఖేడ్: బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నారాయణఖేడ్ పట్టణానికి చెందిన సాయిరాంను నియమిస్తూ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గంధమల్ల ఆనంద్‌గౌడ్ ఉత్తర్వులు జారీచేశారు. హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాల యంలో ఉత్తర్వును అందజేశారు.

20న ఇందిరాపార్కు వద్ద ధర్నా

సంగారెడ్డి అర్బన్, జూలై 18: నిరు ద్యోగుల సమస్యలపై 20దీన ఇందిరా పార్క్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు బీజేవైఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గణే శ్ తెలిపారు. సంగారెడ్డి చౌరస్తాలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో గురు వారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

పట్టుబడ్డ బైక్‌కు 20న వేలం

నర్సాపూర్: మద్యం కేసులో స్వాధీనం చేసుకున్న హీరో గ్లామర్ బైక్‌ను 20న కార్యాలయ ఆవరణలో వేలం వేయనున్నట్లు ఎక్సైజ్ సీఐ పద్మ తెలిపారు. బైక్ ప్రారంభ వేలం ధర రూ.57,455గా నిర్ణయించామని, ఆసక్తి గలవారు కార్యాలయంలో సంప్రదించి వాహనం చూసుకుని, వేలంలో పాల్గొ నాలన్నారు. రూ.14,364 వేలు చెల్లించి పేరు రిజిస్టర్ చేసుకోవాలన్నారు.

ప్రభుత్వ భూమిలో బోర్డు ఏర్పాటు

మనోహరాబాద్: మనోహరాబాద్ మండలం కాళ్లకల్ మేజర్ గ్రామపం చాయతీలోని సర్వే నెంబరు 368, 369లో 7.21 ఎకరాల ప్రభుత్వ భూమిలో తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి బోర్డు ఏర్పాటు చేశారు. అదనపు కలె క్టర్ ఆదేశాల మేరకు బోర్డు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఏడోరోజు రైతుల దీక్ష

నర్సాపూర్: సంగారెడ్డి రీచ్ కెనాల్ కోసం భూములివ్వమని ఇవ్వాలంటే పరిహారం మార్కెట్ ధర ప్రకారం ఇవ్వాలని డిమాండు చేస్తూ చేపట్టిన రిలేనిరాహార దీక్ష గురువారం ఏడోరో జుకు చేరింది.

ఇచ్చిన మాట నిలబెట్టుకోవడమే కాంగ్రెస్ నైజం

- టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి


సంగారెడ్డి పోతిరెడ్డిపల్లి చౌరస్తాలోని రైతువేదికలో నిర్మలాజగ్గారెడ్డికి స్వీటు తినిపిస్తున్న నాయకులు

సంగారెడ్డి రూరల్/సదాశివపేట/కొండాపూర్, జూలై 18: ఇచ్చిన మాట నిలబెట్టుకోవడమే కాంగ్రెస్ నైజమని టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి అన్నారు. సంగా రెడ్డి పట్టణ శివారులోని పోతిరెడ్డిపల్లి చౌరస్తాలో గల రైతువేదికలో గురువారం ఏర్పాటు చేసిన రైతు రుణ మాఫీ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. రైతు లకు ఆగస్టులోగా రెండు లక్షల రుణమాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారని, చెప్పిన గడువు కంటే ముందుగానే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేశార న్నారు. అనంతరం కాంగ్రెస్ శ్రేణులు టపాసులు పేల్చి, స్వీట్లు పంచి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్ర మంలో టీపీసీసీ కార్యదర్శి తోపాజి అనంతకిషన్, మాజీ ఎంపీపీ అంజనేయులు, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి కూన సంతోష్‌కుమార్, సంగారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ బొంగుల విజయలక్ష్మి పాల్గొన్నారు. సదాశివపేట మండలం తంగడపల్లి-మద్దికుంట గ్రామాల పరిధిలోని రైతువేదిక వద్ద గురువారం మండలంలోని అన్ని గ్రామాల రైతులు, కాంగ్రెస్ శ్రేణులు నిర్వహించిన సంబ రాల్లో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి పాల్గొ న్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గడీల రాంరెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు చాట్ల సిద్ధన్న, మాజీ ఎంపీటీసీ చొక్కారెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మునిపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు. కొండాపూర్ రైతువేదికల్లో రైతు రుణమాఫీ సంబరాల్లో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి పాల్గొని రైతులకు మిఠా యిలు తినిపించారు. ఈ సంబరాల్లో ఆత్మకమిటీ చైర్మన్ వై.ప్రభు, మార్కెట్ కమిటీ చైర్మన్ కుమార్ పాల్గొన్నారు.

మతసామరస్యానికి ప్రతీక మొహర్రం: ఎంపీ


టేకూర్‌లో నిర్వహించిన పీర్ల ఊరేగింపులో ఎంపీ సురేషకుమార్ షెట్కార్

న్యాల్‌కల్, జూలై 18: మతసామరస్యానికి ప్రతీక మొహర్రం అని జహీరాబాద్ ఎంపీ సురేష్‌షెట్కార్ అన్నారు. న్యాల్‌కల్ మండలం టేకూర్ గ్రామంలో గురు వారం నిర్వహించిన మొహర్రం పండుగకు జహీరాబాద్ ఎంపీ సురేష్‌షెట్కార్, మాజీ మంత్రి డా.చంద్రశేఖర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ మొహర్రంను కులమతాలకతీతంగా జరుపకుంటారని పేర్కొన్నారు. వివిధ ప్రాంతాల నుంచి పీర్ల ఊరేగింపును చూసేందుకు ప్రజలు అధిక సంఖ్యలో రావడంతో టేకూర్ గట్టు ప్రాంతం కిక్కిరిసింది. ఎలాంటి అవాంచ నీయ సంఘటనలు జరగకుండా జహీరాబాద్ రూరల్ సీఐ నయిమోద్దీన్, ఎస్ఐ రామానాయుడు ఆధ్వర్యంలో గట్టి బందోబస్తును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు భాస్క ర్‌రెడ్డి, సిద్దిలింగయ్యస్వామి, గౌస్, శ్రీనివాస్‌రెడ్డి, తిరుప తిరెడ్డి, రాములుసేట్, జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

పాఠశాలల్లో వేడుకలపై ఆంక్షలు వద్దు

- డీఈవో ఉత్తర్వులు వెనక్కితీసుకోవాలి
- ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక డిమాండ్


డీఈవో వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు

సంగారెడ్డి అర్బన్, జూలై 18: పాఠ శాల వేళల్లో వేడుకలు జరపరాదంటూ డీఈవో జారీచేసిన సర్క్యులర్‌ను వెనక్కి తీసుకోవాలని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక డిమాండ్ చేసింది. ఈ మేరకు గురవారం డీఈవో వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. పాఠశాలల్లో వేడుకలపై ఆంక్షలు పెట్టడం విద్యా ర్థులు, ఉపాధ్యాయులకు దూరం పెంచ డమేనన్నారు. ఎంతోకాలంగా కొనసాగు తున్న ఈ కార్యక్రమాలపై నిబంధనలు విధించడం సరికాదన్నారు. పని వేళల్లో ఉద్యోగ విరమ ణలు, వీడ్కోలు ఇతరత్రా కార్యక్రమాలు నిర్వహించవ ద్దంటూ జారీచేసిన ఉత్తర్వులను డీఈవో వెంటనే ఉప సంహరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు లక్ష్మణ్, సాబేర్‌అలీ, రాంచందర్, శ్రీనివాస్, సుభాన్‌సింగ్, సోమశేఖర్, బాలయ్య, రవిప్రసాద్, లక్ష్మ య్యాయాదవ్, ప్రసాద్, శ్రీనివాస్, రమేశ్ పాల్గొన్నారు.

22న 'ఆశా'ల చలో కలెక్టరేట్


సంగారెడ్డిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఆశావర్కర్లు

సంగారెడ్డి రూరల్/నర్సాపూర్, జూలై 18: ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించకపోతే ఈ నెల 22న చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని చేపడతామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జీ.సాయిలు తెలిపారు. సంగారెడ్డిలోని ఎమ్మెల్యే క్యాంప కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశాలకు కొత్తగా ప్రవేశపెట్టిన ప్రవేశ పరీక్షా విధానాన్ని రద్దు చేయాలాని, ఫిక్స్ వేతనం రూ.18వేలు నిర్ణయించాల న్నారు. 19 ఏళ్లుగా గ్రామాల్లో, బస్తీల్లో బీపీ, షుగర్, థైరా యిడ్, మాతా శిశు సంరక్షణ, కరోనా వంటి విపత్కర పరి స్థితులు వచ్చినప్పుడు ప్రాణాలు సైతం లెక్కచేయకుండా సేవలందించారని గుర్తుచేశారు. రాష్ట్ర ప్రభుత్వం సర్వేచేసే పద్ధతిని వెనక్కి తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్య దర్శి యాదగిరి, నాయకులు బాబురావు, ఆశాలు వరలక్ష్మి, సునిత, రజిత, తుల్జమ్మ తదితరులు పాల్గొన్నారు. నర్సాపూ ర్‌లో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, డివిజన్ కార్యదర్శి నాగరాజు ఆధ్వర్యంలో ఆశావర్కర్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ కార్యక్ర మంలో ఆశావర్కర్లు రేణుక, గోపమ్మ, మాధవి, లక్ష్మి, అంజలి, పద్మ పాల్గొన్నారు.

వేతనాల కోసం వివిన్ పరిశ్రమ కార్మికుల ఆందోళన

జిన్నారం, జూలై 18: ఏడునెలలుగా బకాయి ఉన్న వేత నాలు చెల్లించాలని గడ్డపోతారం వివిన్ డ్రగ్స్ పరిశ్రమ కార్మికులు గురువారం ఆందోళన నిర్వహించారు. సుమారు 50 మంది కార్మికులు పరిశ్రమ ఎస్‌ఆర్‌పీ మెదటి బ్లాకులోకి ఎక్కి ఫ్లెక్సీతో నినాదాలు చేశారు. నిత్యం విధులకు హాజరవు తున్నా యాజమాన్యం వేతనాలు ఇవ్వటం లేదని కార్మికులు తెలిపారు. కొన్నిరోజులుగా పరిశ్రమలో ఉత్పాదనలు నిలిచి పోగా కార్మికులు విధులకు హాజరవుతున్నారు. ఆందోళన చేస్తున్న కార్మికులతో కార్మిక, రెవెన్యూ శాఖల అధికారులు మాట్లాడారు. కాగా సాయంత్రం 6 గంటలు దాటినా కార్మి కుల ఆందోళన విరమించలేదు.

నిరుద్యోగులపై పోలీసుల నిర్బంధాలు ఆపాలి: డీవైఎఫ్ఐ

సంగారెడ్డి రూరల్, జూలై 18: నిరుద్యోగులపై పోలీసుల నిర్బంధాలను ఆపాలని, గ్రూప్-2 పరీక్షలు వాయిదా వేయా లని డిమాండ్ చేస్తూ గురువారం సంగారెడ్డిలో ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులు రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ జిల్లా కార్య దర్శి అనిల్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రూప్-2 పరీ క్షలు వాయిదా వేసి పోస్టుల సంఖ్యను పెంచి భర్తీ చేయా లని డిమాండ్ చేశారు. డీఎస్సీ పరీక్షలు నిర్వహించడమే కాకుండా రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసేందుకు మరొక డీఎస్సీని వెంటనే ప్రకటించాల న్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ బాలికల విభాగం కన్వీ నర్ వాణి, జిల్లా నాయకులు రవి, డీవైఎఫ్ఐ జిల్లా నాయ కులు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తాచాటాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి

సంగారెడ్డి అర్బన్, జూలై 18: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తాచా టాలని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి సూచించారు. సంగారెడ్డి చౌరస్తా సమీపంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో గురువారం జిల్లా పదాధికారుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. జిల్లాలో ప్రజలు ఎదుర్కొంట్ను సమస్యలపై పోరాటం చేస్తూ, సంస్థాగతంగా పార్టీని బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. జిల్లాలోని ఐదు నియోజకవర్గాలకు సంబంధించి మండల, పట్టణ కమిటీలు పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు వెంకటనర్సింహారెడ్డి, రాములు, ప్రతాపరెడ్డి, ప్రభాకర్‌గౌడ్, రామకృష్ణ, ప్రధాన కార్య దర్శులు తదితరులు పాల్గొన్నారు.

31 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

పుల్‌కల్, జూలై 18: చౌటకూర్ మండలంలో అర్హులైన 31 మంది లబ్ధిదారులకు తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రూ.31,03,596 లక్షలు చెక్కులను గురువారం అందజేశారు. కల్యాణలక్ష్మికి అర్హులైన లబ్ధిదారులు ఏడాది కిందట దరఖాస్తులు చేసుకున్నారు. కాంగ్రెస్ అధికారం చేపట్టాక తొలిసా రిగా నిధులు మంజూరు చేయడంతో చెక్కులను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో నయాబ్ తహసీల్దార్ అనుదీప్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు నాగరాజు, యాదగిరి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నత్తి దశరథ్, సీడీసీ మాజీ చైర్మన్ సుభాష్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి: బ్రహ్మాజీ

చేగుంట/రాయికోడ్/వెల్దుర్తి/ జూలై 18: ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని చేగుంట మండల ప్రత్యేకాధికారి బ్రహ్మాజీ అన్నారు. చేగుంట మండలంలోని వడి యరం, చేగుంట ఆదర్శ పాఠశాలల్లో వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. అనంతరం చేగుంట గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఈవో నాగభూ షణం మహిళా సంఘాల సభ్యులకు మొక్కలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చిన్నారెడ్డి, ఏపీవో శ్వేత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. రేగోడు మండలం లోని మోడల్ పాఠశాల ఆవరణలో టీపీసీసీ మెంబర్ మున్నూరు కిషన్ మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సీతారావమ్మ, ఉపాధి సిబ్బంది, ఉపాధ్యా యులు పాల్గొన్నారు. వెల్దుర్తి మండల పరిధిలోని బండపోసాన్‌పల్లిలో నిర్వహించిన వన మహోత్సవంలో ఇన్‌చార్జి ఎంపీడీవో విఘ్నేశ్వర్ పాల్గొని మొక్కలు నాటారు.

ఉపాధిహామీతో వందరోజుల పని కల్పించడమే లక్ష్యం

- డీఆర్డీఏ శ్రీనివాస్‌రావు

నిజాంపేట, జూలై 18: ఉపాధిహామీతో ప్రతిఒక్కరికీ వందరోజుల పని కల్పించ డమే లక్ష్యమని డీఆర్డీఏ శ్రీనివాస్‌రావు అన్నారు. గురువారం ఎంపీడీవో కార్యా లయం వద్ద ఉపాధిహామీ మూడో విడత తనిఖీ ఎంపీడీవో రాజిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. మండలంలోని 14 గ్రామాల్లో 01-04-2023 నుంచి 31-03-2024 వరకు రూ.2 కోట్ల 59 లక్షల ఉపాధి హామీల్లో చేపట్టిన చెట్ల పెంపకం, పూడికతీత, ఫీడర్ ఛానల్ తదితర పనులపై సమీక్షలో చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఉపాధిహామీ పనుల ద్వారా జరిగిన అభివృద్ధిని సభ దృష్టికి తీసుకొచ్చారు. ఈ కార్య క్రమంలో ఏపీడీ రంగాచారి, హెచ్‌ఆర్ రాజేందర్‌రెడ్డి, క్వాసీ రమాకాంత్ తదిత రులు పాల్గొన్నారు.

విద్యార్థుల కోసం అదనపు బస్సు

- జీడిమెట్ల డిపో డీఎం విజయ్‌కుమార్

గుమ్మడిదల, జూలై 18: గుమ్మడిదల మండలంలోని పలు గ్రామాల విద్యార్థులు పట్టణ ప్రాంతానికి ఉన్నత చదువుల కోసం వెళ్లేందుకు సౌకర్యంగా అదనంగా మరో బస్సును కొనసాగిస్తామని జీడీమెట్ల డీఎం విజయ్‌కుమార్ తెలిపారు. 16న అన్నారం గ్రామంలో బస్సులు సరిపోవడం లేదని విద్యార్థులు ధర్నా చేయడంతో స్పందించిన డీఎం ఉదయం 7.00 గంటలకు బొంతపల్లి కమాన్ నుంచి కొత్తగా బస్సును ఏర్పాటు చేశామని తెలిపారు.

'ముదిరాజ్‌లను బీసీ-ఏలోకి మార్చాలి'

అల్లాదుర్గం, జూలై 18: ముదిరాజ్‌లను బీసీ-డీ నుంచి బీసీ-ఏలోకి మార్చాలని ముదిరాజ్ సంఘం మండలాధ్యక్షుడు భూమయ్య డిమాండ్ చేశారు. ఈ విషయమై గురువారం తహసీల్దార్ సతీష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన ముదిరాజ్‌లు ఆర్థికంగా అన్నిరంగాల్లో వెనుక బడి ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు అంజయ్య, అల్లా దుర్గం అధ్యక్షులు మురాడి రాములు, నాయకులు పాల్గొన్నారు.